క్లుప్తంగా

గుండ్లపల్లి సుధాకర్‌కు డాక్టరేట్

నల్లగొండ: నల్లగొండలోని భారత్ భవిత హైస్కూల్‌లో బయాలజీ టీచర్‌గా పనిచేస్తున్న గుండ్లపల్లి సుధాకర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బయాలజీ విభాగంలో డాక్టరేట్ పట్టా పొందారు. ఈసందర్భంగా శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ మోదుగు సత్తిరెడ్డి ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మోదుగు జ్యోతి, ఉపాధ్యాయులు నాగయ్య, నాగేందర్, శ్రీనివాస్, బెంజిమెన్, మౌలానా, పార్థు తదితరులు పాల్గొన్నారు.

పేలుడు పదార్థాలు సీజ్

మఠంపల్లి: మండలంలోని రఘునాథపాలెం గ్రామం సమీపంలోని క్వారీల్లో గనుల తవ్వకానికి కొంతమంది పేలుడు పదార్థాలతో బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్నారు. దీంతో ఇళ్లకు ప్రమాదం సంభవిస్తుందని గుండ్లపల్లి, రఘునాథపాలెం గ్రామస్తుల నుంచి ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో శుక్రవారం మఠంపల్లి పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు స్థానికంగా దాడులు నిర్వహించారు. ఈమేరకు సుమారు 55 జిలటిన్ స్టిక్స్, 4 డిటోనేటర్లు లభ్యమైనట్లు తెలిసింది. పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

దత్తప్పగూడెంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దాడులు


సీజ్ చేసిన మందులు

మోత్కూరు: మోత్కూరు మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో యాదాద్రి భువనగిరి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్వినికుమార్ శుక్రవారం తనిఖీ చేసి అక్రమంగా నిల్వ ఉంచిన మెడిసిన్‌ను పట్టుకున్నారు. పోలెబోయిన భిక్షపతికి చెందిన లైసెన్స్ లేనటువంటి ప్రాంగణంలో నిల్వ చేసిన 26 రకాల మందులను సీజ్ చేశారు. వీటి విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని తెలిపారు. డ్రగ్ యాక్ట్ 1940 ప్రకారం భిక్షపతిపై కేసు నమోదు చేసి రామన్నపేట జడ్జి ముందు హాజరు పరిచినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రూ.51 కొట్టు.. మేకను పట్టు!

- గ్రామాల్లో పోటాపోటీగా దసరా ఆఫర్లు
- ఆరాతీస్తున్న పోలీసులు

చిట్యాల, మర్రిగూడ: దసరా పండగ సమీపిస్తుండటంతో గ్రామాల్లో సందండి నెలకొంటోంది. చిట్యాల, మర్రిగూడ తదితర మండలాల్లో దసరా పండుగ సందర్భంగా యువకులు సరికొత్త స్కీం ప్రారంభించారు. చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామంలో కొందరు యువకులు «51 రూపాయలు కొట్టు.. మేకను పట్టు» అని ప్రచారం చేస్తున్నారు. ఈ స్కీంలో 51 రూపాయలు చెల్లించి కూపన్ తీసుకుంటే.. కూపన్‌ల నుంచి డ్రా తీస్తారు. మొదటి బహుమతిగా పన్నెండు కిలోల మేక, రెండో బహుమతిగా రెండు లిక్కర్ బాటిళ్లు, మూడో బహుమతిగా మరో రెండు లిక్కర్ బాటిళ్లు, నాలుగో బహుమతిగా రెండు కడక్‌నాథ్ నాటు కోళ్లు, ఐదో బహుమతిగా కాటన్ బీర్లు ఇచ్చేట్లు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు.

ఇక్కడ వంద రూపాయల స్కీం

మర్రిగూడ మండలంలోని లెంకలపల్లి గ్రామంలో మరో తీరుగా ఆఫర్లు ప్రకటిస్తున్నారు. వంద రూపాయలు చెల్లించి కూపన్ తీసుకున్న వారిలో నుంచి డ్రా తీసి మొదటి బహుమతి 10కిలోల మేక, రెండవ బహుమతి రెండు మద్యం బాటిళ్లు(బ్లెండర్ స్ప్రైడ్), మూడవ బహుమతి కాటన్ బీర్లు, నాలుగవ బహుమతి రెండు నాటు కోళ్లు, ఐదవ బహుమతి ఒక మద్యం బాటిల్ అందించనున్నామని, వచ్చే నెల 10న గ్రామంలో డ్రా తీయనున్నట్లు నిర్వాహకులు బ్యానర్ ఏర్పాటు చేశారు. కాగా, ఈ ప్రచారాలపై పోలీసులు ఆరాతీస్తున్నారు.



సోషల్‌మీడియాలో వైరల్ అయిన ఫ్లెక్సీ

విద్యుత్ వైరు చోరీ చేసిన ఇద్దరి అరెస్ట్

కోదాడరూరల్: విద్యుత్ వైర్‌ను చోరీ చేసిన ఇద్దరు వ్యక్తులను రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల కోదాడ మండలంలోని వచ్చిన భారీ వర్షాలు, వరదలకు తొగర్రాయి సబ్‌స్టేషన్ పరిధిలో వందల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. వాటి స్థానంలో నూతన స్తంభాలు అమర్చి ఏఏఏ కండక్టర్ వైర్, ఏబీ కేబుల్ విద్యుత్ తీగను లాగారు. మిగిలిన వైర్‌ను సబ్‌స్టేషన్‌లో భద్రపరిచారు. గమనించిన గరిడేపల్లి మండలం వెలిదండకు చెందిన దాసరి వంశీ, తొగర్రాయికి చెందిన నామాల వీరబాబు ఈ నెల 16న వైర్‌ను చోరీ చేశారు. అయితే దానిని వెంటనే విక్రయించకుండా తొగర్రాయిలోని వీరబాబు ఇంట్లో దాచిపెట్టారు. ఈ సంఘటనపై కోదాడ ఏడీఈ వెంకన్న రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. శుక్రవారం విజయవాడలో విక్రయించేందుకు ఆటోలో వెళ్తుండగా రాష్ట్ర సరిహద్దు రామాపురం క్రాస్‌రోడ్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. వారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వైరు విలువ సుమారు రూ.1.10లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.


పట్టుబడిన నిందితులను చూపుతున్న ఎస్‌ఐ

ఉరివేసుకుని ఆత్మహత్య

నకిరేకల్: నకరేకల్‌లోని వీటీ కాలనీలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వీటీ కాలనీలో నివాసం ఉంటున్న నాగోజు నాగాచారికి (35) అతడి భార్యకు తరచూ గొడవ జరిగేది. దీంతో మనస్తాపానికి గురైన నాగాచారి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

గ్యాస్ సిలిండర్‌లో నీరు

తుంగతుర్తి : గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్లలో గ్యాస్ బదులుగా నీరు ఉన్న సిలిండర్‌ను సరఫరా చేయడంతో వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల పరిధిలోని కర్విరాలకొత్తగూడెంలో నారాయణ గత నెలలో గ్యాస్ ఏజెన్సీ దగ్గర సిలిండర్‌ను కొనుగోలు చేశాడు. శుక్రవారం తన ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ ఖాళీ కావడంతో గత నెలలో కొనుగోలు చేసిన సిలిండర్‌ను వినియోగించడానికి ప్రయత్నించాడు. కానీ ఎంతకు గ్యాస్ స్టౌవ్ వెలగకపోవడంతో సిలిండర్‌ను బయటకు తెచ్చి ఊపి చూశాడు. సిలిండర్‌లో నీరు ఉన్నట్లు గుర్తించాడు.

పాముకాటుతో రైతు మృతి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): పాముకాటుతో రైతు మృతిచెందిన సంఘటన ఆత్మకూర్ మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుంటూరు వెంకటయ్య (58) పాము కాటువేసింది. చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య లలితమ్మ, ఇద్దరు కుమారులు, కూమార్తె ఉన్నారు. కుమారుడు సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదులుగౌడ్ తెలిపారు.

టాటా ఏస్ వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

తిరుమలగిరి : టాటాఏస్ వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని తొండ గ్రామం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌కు చెందిన తరుణ్‌కుమార్ తన ద్విచక్ర వాహనంపై చౌటుప్పల్ వెళ్తుండగా తొండ గ్రామ శివారులోకి రాగానే వెనుక నుంచి టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడి కుడి కాలు విరిగింది. సమాచారం అందుకున్న 108కొడకండ్ల అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందజేసి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

15 లీటర్ల సారా స్వాధీనం


అధికారులకు పట్టుపడ్డ సారా తరలిస్తున్న మహిళ

హుజూర్‌నగర్: ఎక్సైజ్ అధికారుల తనిఖీల్లో 15 లీటర్ల సారా, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈసంఘటన హుజూర్‌నగర్ నియోజకవర్గంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం కొత్తతండాకు చెందిన బాణోతు లక్ష్య, బానోతు శైలజ బైక్‌పై 7 లీటర్ల సారా తరలిస్తుండగా మీగడంపాడు వద్ద ఎక్సైజ్ అధికారులు తనిఖీ పట్టుకున్నారు. ఈమేరకు వారిపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా పాలకవీడు మండలం కల్మెట్‌తండాకు చెందిన రూపవత్ బద్యు తన ద్విచక్ర వాహనంపై 8 లీటర్ల సారా తరలిస్తుండగా కల్మెట్‌తండా శివారులో తనిఖీ చేసి సారా పట్టుకుని, వాహనం సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ వెన్నెల, సిబ్బంది నాగయ్య, నాగరాజు, రవి కుమార్, బాలు తదితరులున్నారు.

నదిలో దూకి వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన సాగర్ పోలీసులు

నాగార్జునసాగర్: వంతెన పైనుంచి నదిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధుడిని సాగర్ పోలీసులు కాపాడారు. ఎస్‌ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. హాలియాలోని శాంతినగర్‌కు చెందిన దొడ్డి పాండయ్య మతిస్థిమితం లేక శుక్రవారం కొత్త వంతెనపై తచ్చాడుతూ తిరుగుతున్నాడు. కృష్ణానదిలోకి దూకేందుకు ప్రయత్నిస్తుండడంతో అక్కడ ఉన్న పర్యాటకులు, పండ్ల జ్యూస్ వ్యాపారులు పోలీసులకు సమచారమిచ్చారు. ఎస్‌ఐ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని వృద్ధుడిని కాపాడి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు.


వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సాగర్ ఎస్‌ఐ సంపత్

యువకుడు అదృశ్యం

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని బ్యాంకులో నగదు డ్రా చేసేందుకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన ఎండీ సమీర్(20) గురువారం ఉదయం పట్టణ కేంద్రంలోని స్టేట్ బ్యాంకులో నగదు డ్రా చేసేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. ఆ తర్వాత ఫోన్ స్విచ్‌ఆఫ్‌లో ఉంది. స్థానికంగా, బంధువులను వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని తండ్రి యూసూఫ్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఎల్లగిరిలో..


నర్సింహ

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. గ్రామానికి చెందిన జెర్రిపోతుల నర్సింహ(52) కూలీ పనికి వెళ్లేవాడు. మానసిక వికలాంగుడు కావడంతో పలు మార్లు ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి వచ్చేవాడు. ఈ నెల 17న ఇంటిని వెళ్లిపోయిన అతను ఇంటికి తిరిగి రాలేదు.అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడి

- కామేపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి

మిర్యాలగూడ: వేములపల్లి మండలంలోని కామేపల్లి గ్రామంలో మానసిక దివ్యాంగురాలిపై ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. కామేపల్లి గ్రామానికి చెందిన 21 సంవత్సరాల మానసిక, శారీరక దివ్యాంగురాలి తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్తుండగా ఆమె ఇంటి వద్దే ఉంటోంది. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన మోటం రాకేష్ గత మూడు నెలలుగా ఆమెను బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆమె గర్భం దాల్చింది. తన కుమార్తె సైగలతో చెప్పిన విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు ఈనెల 20న రాకేష్‌తోపాటు అతని తండ్రి దస్తగిరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. చికిత్స చేయించేందుకు రాకేష్, అతని తండ్రి దస్తగిరి, బాబాయి బాబుగిరి తమ కుమార్తెను ఇంటికి తీసుకెళ్లారని, ఈ విషయంపై వారిని నిలదీయగా తమను బూతులు తిట్టారని, ఎవరికైనా చెప్తే చంపుతామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబును వివరణ కోరగా పిటిషన్ రాగానే కేసు నమోదు చేశామని, పూర్తిస్థాయిలో విచారించి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

నూతనకల్: మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామ శివారులో శుక్రవారం పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మహేంద్రనాథ్ తెలిపారు. గ్రామానికి చెందిన గుండా సత్యనారాయణ వ్యవసాయ భూమిలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈమేరకు గుండా సత్యనారాయణ, గాడ్దుల అవిలయ్య, మునిగడప కృష్ణమాచారి, సూరారపు అంజయ్య, మహేష్‌లను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.6వేల 250 నగదు, మూడు బైక్‌లతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాతచాకిరాలలో ఆరుగురిపై కేసు

నడిగూడెం: మండల పరిధిలోని పాతచాకిరాలలో ఖాళీ స్థలంలో పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసి, వారి నుంచి రూ.2050 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అజయ్ కుమార్ తెలిపారు.

ఇసుక డంప్‌ల పరిశీలన

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం గ్రామంలో సీజ్ చేసిన ఇసుక డంప్‌లను శుక్రవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. గతంలో సిస్ కంపెనీ వారు అక్రమంగా నిల్వచేసిన ఇసుకను గతంలో రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకను అక్రమార్కులు దొంగతనంగా ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలించారు. దీనిపై సాక్షి దినపత్రికలో సీజ్ చేసిన ఇసుక మాయం అనే కథనం శుక్రవారం ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారుల ఇసుక డంప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్ మాట్లాడుతూ.. ఇసుక తరలింపుపై పూర్తి విచారణ జరుపుతామని, జిల్లా అధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మగ్దుమ్‌బాబా ఉన్నారు.


అనంతారంలో ఇసుక డంప్‌లను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన వేమవరపు సత్యసాయి(25) మేదరి శైలజ(30) నిడమనూరు మండల పరిధిలోని బొక్కమంతల పాడు వద్ద బట్టలు ఉతకడానికి వెళ్లి బుధవారం ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతయ్యారు. త్రిపురారం మండలంలోని కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కాలువలో గురువారం మేదరి శైలజ మృతదేహం లభ్యం కాగా, శుక్రవారం అదే ప్రాంతంలో సత్యసాయి మృతదేహాన్ని నిడమనూరు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రెండు బైకులు ఢీ

- ఇద్దరు యువకులు మృతి
- మరొకరికి గాయాలు


నాగరాజు (ఫైల్)


ఆంజనేయులు (ఫైల్)

మునుగోడు: రెండు బైకులు ఢీకొని ఇరువురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ సంఘటన శుక్రవారం మునుగోడు గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు పట్టణానికి చెందిన రేవెల్లి నాగరాజు(19) తన బైక్‌పై చొల్లేడు గ్రామం నుంచి మునుగోడుకు వస్తున్నాడు. అదేవిధంగా మర్రిగూడ మండలం నర్సిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కీలకత్తుల ఆంజనేయులు(23) మరో వ్యక్తితో కలిసి బైక్‌పై నల్లగొండ నుంచి మర్రిగూడకు వెళ్తున్నాడు. మునుగోడు గ్రామ శివారులో మూలమలుపు వద్ద అతి వేగంగా వచ్చి ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఆంజనేయులు బైక్‌పై వెనుక కూర్చున్న మరో వ్యక్తి రోడ్డు పక్కనే ఉన్న పత్తి చేనులో ఎగిరిపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించినా చుట్టుపక్కల వారు 108 సాయంతో చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

డివైడర్ ఢీకొని ఒకరి మృతి


రాంబాబు మృతదేహం

మునగాల: మునగాల మండలంలోని మాధవరంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన రాజారపు రాంబాబు(57) తన భార్య రమణ, కుమారుడితో కలిసి దీపావళి పండుగకు అవసరమయ్యే మట్టి ప్రమిదలను కొనుగోలు చేసేందుకు హైదరాబాద్‌కు వెళ్లారు. ప్రమిదలు కొనుగోలు చేసి మినీ గూడ్స్ వాహనంలో గుంటూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో మాధవరం వద్ద వీరి వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రాంబాబును ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. వాహనానికి చెందిన ఇద్దరు డ్రైవర్లు జె.రోషిబాబు, గోనె క్రాంతికుమార్‌తో పాటు మృతుడి భార్య రమణకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు లోకేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహానికి కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పట్టుబడిన మద్యం సీసాలు ధ్వంసం

కోదాడరూరల్ : కోదాడ పట్టణ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన అక్రమ మద్యం సీసాలను నల్లగొండ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం సివిల్, ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్లు పట్టణ సీఐ రాము తెలిపారు. అక్రమ మద్యం రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సివిల్, ఎక్సైజ్ పోలీసు సిబ్బంది ఉన్నారు.


మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న సివిల్, ఎక్సైజ్ పోలీసులు

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఆవిష్కరణ



విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న పద్మశాలీ సంఘం నాయకులు

యాదగిరిగుట్ట: అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట పట్టణంలోని సత్రభవనం ఆవరణలో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని శుక్రవారం పద్మశాలీ సంఘం ప్రాటన్ చిలువేరు కాశీనాథ్, అన్నసత్రం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్, ఆలిండియా అధ్యక్షుడు కందగట్ల స్వామి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీశైలం పద్మశాలి సంఘ సత్రం అధ్యక్షుడు సూర్యనారాయణ, ఢీకొండ జోగయ్య తదితరులున్నారు.

‘ప్లాంటిక్స్’తో సాగు సమస్యలకు చెక్

- యాప్‌లో రైతులకు సమగ్ర సమాచారం
- అందుబాటులో 350 రకాల తెగుళ్లకు నివారణ చర్యలు

పెద్దవూర: వ్యవసాయంలో వస్తున్న నూతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం రైతులకు లాభసాటిగా మారుతోంది. రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సమగ్ర సమాచారం జర్మనీలోని పీట్ (ప్రోగ్రెసివ్ అగ్రికల్చర్ అండ్ ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీ) శాస్త్రవేత్తలు రూపొందించిన «ప్లాంటిక్స్» యాప్ ద్వారా అందుతోంది. ప్లాంటిక్స్ యాప్‌ను తెలుగు రైతుల అవసరాలకు అనుగుణంగా ఇక్రిశాట్, ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రూపొందించారు. తెగుళ్లు, చీడపీడలకు సంబంధించిన సమగ్ర సమాచారం తెలుగులో ఉండటం ఈ యాప్ ప్రత్యేకత. 350 రకాలకు పైగా తెగుళ్లు, వాటికి గల నివారణ చర్యలు శాస్త్రవేత్తలు ఈ ప్లాంటిక్స్ యాప్‌లో నిక్షిప్తం చేశారు.



ప్లాంటిక్స్ యాప్‌లో కనిపించే అంశాలు

డౌన్‌లోడ్ చేసుకునే విధానం..

ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్లేస్టోర్‌లోకి వెళ్లి ప్లాంటిక్స్(ప్లాంటిక్స్) అని టైప్ చేయగానే ప్లాంటిక్స్ యువర్ క్రాప్ డాక్టర్ అని వస్తుంది. ఇది డౌన్‌లోడ్ కాగానే ఓపెన్ చేస్తే స్క్రీన్‌పై తెలుగుతో పాటు వివిధ రకాల భాషలు ఉంటాయి. యాప్ ఓపెన్ చేశాక పేరు, ఫోన్ నంబర్ ఎంటర్ చేయాలి. ఫోన్‌కు ఒక కోడ్ వస్తుంది. దీనిని అందులో ఎంటర్ చేస్తే సేవలు అందుబాటులోకి వస్తాయి.



పంటల ఎంపిక ఇలా..

ప్లాంటిక్స్ యాప్‌లో సాగు చేస్తున్న, సాగు చేయాలనుకుంటున్న పంటలను ఎంపిక చేసుకోవచ్చు. తర్వాత ఆ పంటలు ఏ కాలంలో సాగు చేయాలి. ఏ నేలలు అనుకూలమో, పంట విస్తీర్ణం బట్టి ఎరువులు ఏ మోతాదులో వేయాలో యాప్‌లో తెలుసుకోవచ్చు. పంటలకు తెగుళ్లు సోకినా, చీడపీడలు వ్యాపించినా ఏ మందులు పిచికారీ చేయాలో, ఎలా నివారించాలో యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. పంటలను ఆశించిన చీడపీడలను తొలి దశలోనే గుర్తించి రైతులను అప్రమత్తం చేసేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుంది.

వాతావరణంలో మార్పులు తెలుసుకోవచ్చు

ఈ యాప్ ద్వారా వాతావరణంలో మార్పులను తెలుసుకునే వీలు ఉంది. దీని కారణంగా పంటను రక్షించుకోవడంతో పాటు వర్షాల బారిన పడకుండా పంట దిగుబడి కాపాడుకోవచ్చు. రానున్న రోజుల్లో వాతావరణంలో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయో ఈ యాప్ ద్వారా ముందే తెలుసుకోవచ్చు.

ఫొటో పంపితే సమస్యకు పరిష్కారం

పంటలకు తెగుళ్లు సోకినా, చీడపీడలు ఆశించినా, పంటల్లో అకస్మాత్తుగా మార్పులు సంభవించినా ప్లాంటిక్స్ యాప్ ద్వారా నివారణ చర్యలు తెలుసుకోవచ్చు. పొలం దగ్గరికి వెళ్లాక ప్లాంటిక్స్ యాప్‌లో పంట ఆరోగ్య పరీక్ష అంశంపై క్లిక్ చేసి సమస్య ఉన్న ప్రదేశంలో ఫొటో తీయాలి. తర్వాత ఆ ఫొటోను అప్‌లోడ్ చేయాలి. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు స్పందించి సమస్య నివారణపై సలహాలు, సూచనలు అందిస్తారు. ఈ యాప్ ద్వారా రైతులు వెంటనే నివారణ చర్యలు చేపట్టవచ్చు.

క్లుప్తంగా

ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలి

రామన్నపేట: రామన్నపేట పట్టణానికి సమీపంలో సిమెంట్ పరిశ్రమ స్థాపనకు వచ్చే నెలలో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ కోరారు. శుక్రవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. లాజిస్టిక్‌పార్కు పేరుతో భూములను కొనుగోలు చేసి కాలుష్య కారకమైన సిమెంట్ పరిశ్రమను స్థాపించడానికి ప్రయత్నించడం మోస పూరితమైన కుట్ర అని తెలిపారు. సిమెంట్ పరిశ్రమ స్థాపనకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు శివరాత్రి సమ్మయ్య, ఊట్కూరి భగవంతం, గంగాపురం వెంకటయ్య, వీరమల్ల ముత్తయ్య, కళ్లెం రామచంద్రం, రచ్చ యాదగిరి, కళ్లెం యాదగిరి, ఊట్కూరి క్రిష్ణ, ఏనూతుల రమేష్, జగన్నాథం, గండికోట నర్సింహ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి

గుండాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి దేవనబోయిన అయిలయ్య విద్యార్థులకు వాటర్ ప్లాంట్ అందజేయడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాటర్ ఫిల్టర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి గౌడ్, నాయకులు ద్యాప కృష్ణారెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు, ఎ.రాంరెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ మెంబర్ ఎం.డి.షర్ఫొద్దిన్, సిరాజోద్దిన్, రాజరత్నం, నాగిరెడ్డి, భిక్షపతి, లక్ష్మయ్య, తదితరులున్నారు.

ఎంఈఓ బాధ్యతల స్వీకరణ

మోటకొండూర్: మోటకొండూర్ ఇంచార్జ్ ఎంఈఓగా కేతిరెడ్డి రఘురాంరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఈఓ కార్యాలయంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో భైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, భాగ్యశ్రీ, రాజశేఖర్‌రెడ్డి, భవాని, విశ్వరూపం, సుధారాణి, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛత హీ సేవలో భాగస్వాములు కావాలి

భువనగిరిటౌన్ : స్వచ్ఛతా హీ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరిలో వరల్డ్ టూరిజం డే నిర్వహించారు. ఈ సందర్భంగా చారిత్రాత్మక ప్రదేశాలు, టూరిజం ప్రదేశాలను పరిశుభ్రం చేయించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల శాఖ అధికారి శ్రీ ధనుంజయ, మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ టి. ప్రసాద్ రావు, హెల్త్ అసిస్టెంట్ రజిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులను పరిష్కరించాలి

గుండాల : ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మండల ప్రత్యేక అధికారి కె.శామ్యూల్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మండల ప్రత్యేక అధికారి కె.శామ్యూల్ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ ఎ.దేవిక, సూపరింటిండెంట్ డి.మల్లయ్య, సీనియర్ అసిస్టెంట్లు దేవేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే బీసీలకు న్యాయం



గౌడ సంఘం భవన నిర్మాణానికి శంకు స్థాపన చేస్తున్న నాయకులు

చౌటుప్పల్ రూరల్: కాంగ్రెస్ పార్టీ పాలనలోనే బీసీలకు న్యాయం జరుగుతుందని చౌటుప్పల్ మాజీ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు పబ్బు రాజుగౌడ్ అన్నారు.మండలంలోని రెడ్డిబావి గ్రామంలో శుక్రవారం గౌడ సంఘం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకులు బీసీలను ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వినియోగించుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, సుర్వి నర్సింహ్మా, గంగాపురం వెంకటేష్,నాయకులు బాలగోని అంజనేయులు, నందగిరి పరమేష్, మల్లయ్య, పల్లె జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

సంస్థాన్ నారాయణపురం: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందుగుల బాలకృష్ణ అన్నారు. సంస్థాన్ నారాయణపురంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మాజీ ఎంపీపీ ఉమాదేవి, ప్రేం చందర్‌రెడ్డి తదితరులున్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

స్వాతంత్య్ర సమరయోధుడు, మాజీ మంత్రి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- సాక్షి, నెట్‌వర్క్



భువనగిరి : బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు



పోచంపల్లి : బాపూజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు



యాదగిరిగుట్ట : బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



రామన్నపేట : నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తదితరులు



చౌటుప్పల్ : బాపూజీ క్యాంస్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మోత్కూరు : బాపూజీ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్



సంస్థాన్ నారాయణపురంలో కొండా లక్ష్మణ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



భువనగిరి : బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఓబీసీ మోర్చా నాయకులు



రాజాపేట : రఘునాథపురంలో బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



బొమ్మలరామారం : నివాళులర్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు



రామన్నపేట : వెల్లంకిలో నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

ఆలేరు మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

- ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

ఆలేరురూరల్: ఆలేరు మున్సిపాలిటీ అభివృద్ధికి కృషిచేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని అమృత్ 2.0 పథకం కింద 12 కోట్ల నిధులతో వాటర్ ట్యాంకుల నిర్మాణం 1000 కెఎల్, 700 కెఎల్ సామర్థ్యంతో పైప్‌లైన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల్లో రెండు ట్యాంకులను పూర్తి చేసి అన్ని కాలనీలకు మిషన్ భగీరథ నీరందిస్తామన్నారు.అనంతరం బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, కమిషనర్ లక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు సునీతశ్రీనివాస్‌రెడ్డి, బేతిరాములు, శ్రీకాంత్, జనగాం ఉపేందర్‌రెడ్డి, ఎగ్గిడి శ్రీశైలం, తుంగ కుమార్ బుగ్గ నవీన్ మాజీ వైస్ఎంపీపీ లావణ్యవెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను రోడ్డుపాలు చేయొద్దు



మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి

చౌటుప్పల్ : రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణం పేరిట పేదలను రోడ్డుపాలు చేయొద్దని సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ట్రిపుల్ ఆర్ బాధితుల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓఆర్ఆర్, ట్రిపుల్‌ఆర్‌కు మధ్య 40కిలోమీటర్ల నిబంధన పాటించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ పాటించకపోవడానికి గల కారణాలు ఏమిటని ఆయన ప్రశ్నించారు. పెద్దలను కాపాడేందుకు పేదలను బలి చేస్తున్నారని ధ్వజమెత్తారు. రైతుల భూమికి బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారం పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు, నిర్వాసితులు బూర్గు కృష్ణారెడ్డి, బందారు నర్సింహ్మా, మారుపాక రామలింగం, డిల్లీ మాధవరెడ్డి, బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, చెన్నబోయిన వెంకటేశం, ఆకుల ధర్మయ్య, సందగళ్ల మల్లేష్, దబ్బటి రాములు, ఉష్కాగుల రమేష్, శంకర్, నర్సిరెడ్డి, జాల శ్రీశైలం, వెంకటేశం, జంగయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్ ప్రారంభించారు. మున్సిపల్ సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్, వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి, కౌన్సిలర్లు గుండు మధు, దేవరాయ కుమార్, మేనేజర్ నిర్మల, మెప్మా పీడీ రమేశ్, మండల వైద్యాధికారిణి శ్రీవాణి, కపిల, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

భువనగిరిటౌన్ : స్వచ్ఛతా హీసేవ కార్యక్రమంలో భాగంగా భువనగిరి మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్మికులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.రామాంజులరెడ్డి, ఎస్ఐ ప్రసాద్‌రావు, హెల్త్ అసిస్టెంట్ రజిత తదితరులు పాల్గొన్నారు.

యువజనోత్సవాలతో కళాప్రతిభ వెలికితీత



నృత్యం చేస్తున్న యువతులు

భువనగిరి : యువజనోత్సవాలతో యువతలో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీయవచ్చని ఎమ్మెల్సీ తీన్మార్‌మల్లన్న అన్నారు. జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు, ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక భువనగిరి ఖిలా వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పురావస్తు శాఖ ఏడీ నాగలక్ష్మి, వెంకట్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి కె.ధనుంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా ఉద్యమకారుల ఫోరం ఆవిర్భావ దినోత్సవం

భువనగిరి : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫోరం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిస్టఫర్ స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జోగు అంజయ్య, గంధమల్ల మల్లమ్మ, శీలం స్వామి, మారగోని శ్రీనివాస్‌గౌడ్,బత్తిని రవి, మల్లం వెంకటేశం,రమేష్, లింగయ్య,స్వామి, శ్రీనివాసచారి,కలమ్మ, గణేష్ పాల్గొన్నారు.

పోషక ఆహారంపై అవగాహన

బీబీనగర్: మండలంలోని జియాపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన చిరుధాన్యాలు, పప్పులు, గుడ్లు, తీసుకోవాల్సిన విధానలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఏస్ సూపర్‌వైజర్ లలిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండాలలో పోషణ మాసోత్సవం

గుండాల : గర్భిణులు, బాలింతలకు పోషకాహార లోపం లేకుండా చూడటమే అంగన్‌వాడీ కేంద్రాల ధ్యేయమని మండల ప్రత్యేక అధికారి కె.శామ్యూల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పోషణ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ జ్యోత్స్న, తహసీల్దార్ జలకుమారి, ఎంపీడీఓ దేవిక, వైద్యాధికారి హైమావతి, సూపర్ వైజర్లు షమీమ్‌బేగం, యాకుపాషాబేగం, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు

భువనగిరిటౌన్ : వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని స్థానిక 24, 25, 26వ వార్డులలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ మాయ దశరథ, రత్నపురం బలరామ్, ఈరపాక నర్సింహ తదితరులు ఉన్నారు.

రుణమాఫీ చేయాలి

రామన్నపేట : రైతు రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా జరిగిన సీపీఎం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.31వేల కోట్లకు గాను కేవలం రూ.18వేల కోట్లు మాత్రమే మాఫీ చేసిందని తెలిపారు. సమావేశంలో నాయకులు అంబటి మల్లారెడ్డి, బల్గూరి అంజయ్య, బడుగు రమేష్, అంబటి సురేందర్‌రెడ్డి, దాడి మల్లారెడ్డి, కూనూరు వెంకటేశం, గణేష్, గుంజె సైదులు, మార్త భూపాల్ పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

రామన్నపేట : యువత పర్యాటక రంగంలోని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రామన్నపేట ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాహత్‌ఖానం సూచించారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్‌రావు, వాణిజ్యశాస్త్రం విభాగాధిపతి డాక్టర్ సునీత , అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జేసీ బాబు తదితరులు పాల్గొన్నారు.

పిట్టలగూడేనికి బీటీ రోడ్డు వేయాలి

మోటకొండూర్: మోటకొండూర్ మండలంలోని చాడ మదిర పిట్టలగూడెం గ్రామానికి బీటీ రోడ్డు వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేషం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ గ్రామంలో కాల్య గోపాల్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామశాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొలగాని జయరాములు, నూతన గ్రామశాఖ అధ్యక్షులు తుమ్మల మల్లేశం, సహాయ కార్యదర్శి కాల్య విజయ్, కాల్య గోపాల్ ఉన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

బీబీనగర్: మండలంలోని భట్టుగూడెం గ్రామంలో

విద్యార్థుల భవిష్యత్‌ను మార్చేది గురువు

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



యాదగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్లన్న

యాదగిరిగుట్ట, యాదగిరిగుట్ట రూరల్: విద్యార్థుల భవిష్యత్‌ను మార్చేది గురువు మాత్రమే అని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. యాదగిరిగుట్ట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జేవైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారం సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రుల తర్వాత గౌరవించేది ఉపాధ్యాయులనే అని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పేరు మీద ప్రతీ గ్రామంలో పాఠశాలలను అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ తర్వాత యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని యాదగిరిపల్లిలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రతి తరగతి గదిని పరిశీలించి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో ఎంపీడీఓ నవీన్ కుమార్, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, సీఐ రమేష్, ఎస్ఎస్ఎస్ అధికారి పి.రాంబాబు, అధ్యాపకులు అనహిల్, రాజు, కృష్ణ, రమేష్, హైమావతి, బలరాం, నాగలక్ష్మి, సుబ్బలక్ష్మి, అనిత, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే ధ్యేయం



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్: రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను సరాఫరా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు.మండలంలోని శేరిలా గ్రామంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో లో ఓల్టేజ్ సమస్య లేకుండా నిరంతరం విద్యుత్ సరాఫరా చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మాజీ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పబ్బు రాజు, మాజీ వైస్ఎంపీపీ ఉప్పు భద్రయ్య, కాయితీ రమేష్, ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐహెచ్‌టీని పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలి

- ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత



నివాళులర్పిస్తున్న గొంగిడి సునిత తదితరులు

ఆలేరురూరల్ : ఐఐహెచ్‌టీ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ)ని భూదాన్‌పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలేరు గెస్ట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చేనేత కార్మికుల్లో నూపుణ్యాభివృద్ధి పెంపొందించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పర్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోచపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.పోచంపల్లిలో స్కిల్ యూనివర్సిటీ, ఐఐహెచ్‌టీ ఏర్పాటు అయితే చేనేత పరిశ్రమపై అధారిపడి జీవిస్తున్న కుటుంబాలకు అనేక రకాలు ప్రయోజనాలు చేకూరేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తెలంగాణ ప్రాంతాన్ని తిరోగమనంలోకి తీసుకెళ్తుందని విమర్శించారు. అంతకుమందు కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, పుట్ట మల్లేషం, గంగుల శ్రీనివాస్, బొట్ల పరమేశ్వర్, బేతి రాములు, పత్తి వెంకటేష్, చింతకింది మురళి, బాలస్వామి, జూకంటి శ్రీకాంత్, రమణారెడ్డి, మొగులుగాని మల్లేషం పాల్గొన్నారు.

సమీక్షలతో కాలయాపన : గంగిడి మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్ : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించి సమీక్షలతో కాలయాపన చేస్తుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి విమర్శించారు. మున్సిపాలిటీలోని లక్కారం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన చౌటుప్పల్, నారాయణపురం మండలాల సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తన కుర్చీని కాపాడుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారే తప్ప ప్రజలను పట్టించుకోవడంలేదన్నారు. రైతుభరోసా, రుణమాఫీ విషయంలో రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వచ్చేనెల 5లోపుగా అత్యధిక సభ్యత్వం చేయించిన నియోజకవర్గంగా మునుగోడును నిలపాలని కోరారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, నల్లగొండ జిల్లా సభ్యత్వ ఇంచార్జి తూళ్ల వీరేందర్‌గౌడ్, నాయకులు రమనగోని శంకర్, శ్రీధర్‌బాబు, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేష్, సర్వి రాజు, నాయకులు ఆలె చిరంజీవి, బచ్చనగోని దేవేందర్, బత్తుల జంగయ్య, ముత్యాల భూపాల్‌రెడ్డి, గుజ్జుల సురేందర్‌రెడ్డి, కాయితి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో 1008 పంచలోహ సహస్ర శ్రీచక్రాల ప్రతిష్టాపన

భువనగిరి రూరల్ : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని రమణేశ్వరంలో అక్టోబర్ 12, 13 తేదీల్లో 1008 పంచలోహ సహస్ర శ్రీచక్రాలు, 9 అడుగుల పంచలోహ శ్రీచక్రాన్ని ప్రతిష్టించబోతున్నట్లు సిద్దగురు రమణానంద మహర్షి తెలిపారు. శుక్రవారం రమణేశ్వరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా మూడు మహా ఆలయాలను ఈ దేవి నవరాత్రుల్లో నిర్మించబోతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దనసరి అనసూయ (సీతక్క), భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని ఆహ్వానించినట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

జిల్లా పరిషత్ పాఠశాలలో కొనసాగుతున్న మండల స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం బహుతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోళి పింగళ్‌రెడ్డి, ఎంఈఓ సురేష్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు దివాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష అనుభవంతో వృత్తి విద్యలో నైపుణ్యం

మోత్కూరు : ప్రత్యక్ష అనుభవంతో వృత్తి విద్యలో నైపుణ్యం సాధించవచ్చని మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాధికారి తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అపరల్ కోర్సు విద్యార్థినులు తిరుమలగిరిలోని వాసవీ షాపింగ్ మాల్‌లో క్షేత్ర స్థాయి సందర్శన చేశారు. కార్యక్రమంలో కోర్సు ఉపాధ్యాయిని లు రేవతి, శ్రావ్య తదితరులున్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

భువనగిరిటౌన్ : రాయగిరి సహృదయ అనాథాశ్రమంలో శుక్రవారం వయో వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి. కె నరసింహారావు, వయోవృద్ధుల అసోసియేషన్ మెంబర్స్ పోలి శంకర్ రెడ్డి. ఎం బాలేశ్వర్, అంజయ్య, శ్రీనివాస్ రెడ్డి. నరసింహారెడ్డిచ సీడీపీఓలు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

భువనగిరి : విద్యార్థులు ఐటీఐ అభ్యసించి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఐటీఐ హైదరబాద్ రీజియన్ ఆర్‌డీఓ రాజు అన్నారు. శుక్రవారం పట్టణలోని సద్దార్థ, శివసాయి ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్ కాన్వొకేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఐటీఐల కన్వీనర్ హరికృష్ణ, కళాశాలల కరస్పాండెంట్ కట్టా మోహన్‌రెడ్డి, వైశాఖరెడ్డి, అధ్యాపకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని చొల్లేరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, మాజీ ఎంపీటీసీ అరుణ, లావణ్య పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం అందజేత

మోత్కూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జూడో పోటీల్లో మోత్కూరు కస్తూరిబా విద్యార్థిని కె.అలేఖ్య రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించింది. శుక్రవారం స్థానిక కేజీబీవీలో అలేఖ్యను మండల విద్యాధికారి టి.గోపాల్‌రెడ్డి సన్మానించి సిల్వర్ మెడల్, ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ యాదమ్మ, జూడో కోచ్ అన్నెపు వెంకట్, పీఈటీ జ్ఞానసుందరి పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో జమ్మి మొక్క నాటాలి

భువనగిరి : ప్రతి గ్రామంలో జమ్మి మొక్క నాటాలని మాజీ ఎంపీ, గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకులు జోగినపల్లి సంతోష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని స్వర్ణగిరి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావుతో కలసి ఆలయం ఆవరణంలో జమ్మి మొక్క నాటారు.

ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలన

గుండాల: మండల కేంద్రానికి చెందిన గోపాల్‌దాస్ అయిలయ్య లోఓల్టేజీతో మోటార్లు నడవడం లేదని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం పరిశీలనకు వచ్చిన రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌కు విన్నవించారు. అడిషనల్ కలెక్టర్, డీఈ ఆదేశాల మేరకు శుక్రవారం ఏడీ బాలునాయక్ సదరు రైతు వ్యవసాయ బావి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పారు.